ఇంటింటికీ రాములోరి అక్షింతలు



కథలాపూర్‌లో అయోధ్య రాముని అక్షింతలతో భక్తుల ఊరేగింపు



వేములకుర్తిలో అక్షింతలను ఊరేగింపుగా తీసుకువెళ్తున్న గ్రామస్తులు

జగిత్యాలటౌన్: శ్రీరామ జన్మభూమి అయోధ్య నుంచి వచ్చిన రాముల వారి అక్షింతలకు జిల్లా వ్యాప్తంగా మంగళవారం అపూర్వ స్వాగతం లభించింది. జగిత్యాల పట్టణంలోని గీత గ్రంథాలయం నుండి అక్షింతలు, కలశాలను అత్యంత భక్తి శ్రద్ధలతో తలపైన పెట్టుకుని శ్రీరామ సంకీర్తనతో మంగళవారం పట్టణంలో ఊరేగించారు. కోలాటాలు, భజనలతో మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. క్యార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకురాలు ముదుగంటి ఉమ, జిల్లా సహ కార్యదర్శి గాజోజు వర్షినిసంతోష్, కోశాధికారమి మామిడాల రాములు, నగర అధ్యక్షుడు జిట్టవేణి అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

వేములకుర్తికి చేరిన రాముని అక్షింతలు

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తికి మంగళవారం అయోధ్యరాముడి అక్షింతలు చేరడంతో భక్తులు పల్లకిలో రాముని అక్షింతలను శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి సీతారామ బాలంజనేయస్వామి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకవెళ్లారు. కార్యక్రమంలో సర్పంచ్ సున్నం నవ్యశ్రీ, ఎంపీటీసీ దొంటి మమత, ఉపసర్పంచు అనతి పెద్ద రాజం,అయ్యప్ప స్వామి భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కథలాపూర్‌లో శోభాయాత్ర

కథలాపూర్: అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి నుంచి రాములవారి అక్షింతలు మంగళవారం మండలకేంద్రానికి చేరుకున్నాయి. స్వామివారి అక్షింతలతో భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. కథలాపూర్‌లోని ప్రధానవీధుల గుండా భక్తి పాటలు పాడుతూ ఊరేగించారు. కార్యక్రమంలో సర్పంచ్ కంటె నీరజ, ఎంపీటీసీ లత, ప్రతినిధులు పాల్గొన్నారు.

రాయికల్: అయోధ్యలోని రాములవారి అక్షింతలు మంగళవారం రాయికల్ మండలం కొత్తపేట



కొత్తపేటలో స్వామివారి అక్షింతలతో గ్రామస్తులు

గ్రామానికి చేరాయి. ఈ సందర్భంగా గ్రామంలోని రాజరాజేశ్వరస్వామి నాగాలయం నుంచి సీతారామచంద్రస్వామి వాల్మీకి ఆలయంలో అక్షింతలను నెత్తిన పెట్టుకుని శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజేశం, ఉపసర్పంచ్ రాజశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

దొంగ మల్లన్న సన్నిధిలో విప్ పూజలు



జాతరలో భక్తుల మధ్య ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

మేడిపల్లి: భీమారం మండలం రాగోజీపేటలో దొంగ మల్లికార్జున స్వామి వారి జాతరలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మంగళవారం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ స్వామి వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నారు. అదేవిధంగా ఈ ప్రాంతంలో పాడిపంటలు సమృద్ధిగా పండి పశు సంపద బాగుండి వర్షాలు సకాలంలో కురవాలని కోరారు. కార్యక్రమంలో మేడిపల్లి, భీమారం మండల అధ్యక్షులు ఏనుగు రమేశ్ రెడ్డి, సింగిరెడ్డి నరేశ్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నీరటి మల్లేశం, మండల బీసీ సెల్ అధ్యక్షులు ముంజ కిషన్ గౌడ్, మాదం వినోద్,మండల మహిళ అధ్యక్షురాలు విజయ లింగమూర్తి, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

భీమారం మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన సురకంటి శ్రీనివాస్ రెడ్డి ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరామర్శించారు. అలాగే ఎన్నికల ప్రచారంలో గుండెపోటుతో జంగంపల్లి విజయ్ మృతి చెందగా, ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

పరిహారం చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న ప్రభుత్వ విప్

కథలాపూర్: మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన పస్తం బాలమణి అనే మహిళ విద్యుత్ ప్రమాదంలో మృతిచెందగా, విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో రూ.5 లక్షల పరిహారం చెక్కు మంజూరు కాగా, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంగళవారం బాధిత కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈలు జమీల్‌పాషా, భూమేశ్వర్, సర్పంచ్ గాండ్ల వీణ, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేదలకు ఉన్నత వైద్యం అందించాలి



విప్‌కు స్వాగతం పలుకుతున్న నిర్వాహకులు

జగిత్యాల: పేదలకు ఉచితంగా వైద్యం అందించాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మంగళవారం సాయి మల్టీస్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజ మాట్లాడారు. ప్రైవేట్ ఆస్పత్రులు నెలకొల్పినప్పటికీ పేదలకు సైతం మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఆయన వెంట నాయకులున్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ఆస్పత్రులు



క్లీనిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల: కార్పొరేట్‌కు దీటుగా జగిత్యాలలో ఆస్పత్రులు వెలుస్తున్నాయని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. మంగళవారం పట్టణంలో సాయి సూపర్‌స్పెషాలిటీ డెంటల్ క్లీనిక్‌ను ప్రారంభించి మాట్లాడారు. జిల్లా కేంద్రం కావడంతో జగిత్యాలలో కార్పొరేట్ స్థాయికి దీటుగా ఆస్పత్రులు వైద్యం అందిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, రాంచందర్‌రావు, కౌన్సిలర్ కోరె గంగమల్లు, పాల్గొన్నారు.

ప్రజాపాలన అమలులో కీలకంగా వ్యవహరించాలి

మల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆరు గ్యారంటీలను ప్రజాపాలన కార్యక్రమంతో అమలు చేస్తున్నందునా కాంగ్రెస్ వార్డుసభ్యులు కీలకంగా వ్యవహరించాలని కాంగ్రెస్ మండల అధికార ప్రతినిధి బోయిని హన్మాండ్లు అన్నారు. మండలంలోని పాతదాంరాజుపల్లిలో మంగళవారం మాట్లాడారు. ఈ నెల 28 నుంచి మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించనున్నారన్నారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ వార్డు సభ్యులు అందుబాటులో ఉండి ప్రజలకు అవగాహన కల్పిస్తూ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తూ విజయవంతం చేయాలని కోరారు.

ఆలయానికి విరాళం అందజేత



నరేశ్ రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌లోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి(కొండస్వామి) ఆలయ అభివృద్ధికి భీమారం మండలం మన్నెగూడం సర్పంచ్ సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి రూ.50 వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా మంగళవారం నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా నరేశ్‌రెడ్డిని కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో జనార్దన్, రాజ్‌పాల్‌రెడ్డి, గంగాధర్,రాజారెడ్డి, గుండయ్య,రాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనం



అంగన్‌వాడీ కేంద్రం భవనం

కథలాపూర్: మండలంలోని తుర్తిలో అంగన్‌వాడీ కేంద్రం భవనం నిర్మాణం అసంపూర్తిగా ఉంది. సొంత భవనం లేకపోవడంతో చిన్నారులు ఇక్కట్లపాలవుతున్నారు. గ్రామంలో బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు సేవలందించేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు సిబ్బంది వాపోతున్నారు. ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్నప్పటికీ పూర్తి చేయించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపడంలేదని స్థానికులు పేర్కొన్నారు. రూ. 3.50 లక్షలు వెచ్చిస్తే పూర్తవుతుందని అధికారులు అంచనా వేశారు. స్థానికులు పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించామన్నారు. ఇప్పటికైనా అంగన్‌వాడీ భవనం పూర్తి చేయించేందుకు పాలకులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా వేంకటేశ్వరుని రథోత్సవం



ఇబ్రహీంపట్నంలో ఆలయం చుట్టూ రథాన్ని లాగుతున్న భక్తులు

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని ధర్మరస్వామి వేంకటేశ్వరస్వామి ఆలయ జాతర,ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ నెల 24 నుంచి జాతర ఉత్సవాలు నిర్వహించి, చివరి రోజు హోమం చేశారు. అనంతరం భక్తులు రథోత్సవంలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు చక్రపాణి మాదవచార్యులు, సత్యనారాయణ, సంతోష్, ప్రవీణ్‌చార్యులు, మండల కో ఆప్షన్ సభ్యుడు ఎలేటి చిన్నారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

దత్తాత్రేయ విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠాపన చేస్తున్న అర్చకులు

మెట్‌పల్లిరూరల్: మండలంలోని వెల్లులలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో మంగళవారం దత్తాత్రేయ స్వామి విగ్రహన్ని ప్రతిష్ఠించారు. దత్త జయంతిని పురస్కరించుకుని అర్చకులు నంబిగోపాలశర్మ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠాపన చేసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మనోహర్‌శర్మ, రాజేందర్‌శర్మ, శ్రీనివాస్‌శర్మ, అశోక్‌శర్మ, వినయ్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

మద్దుట్లలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన

మల్యాల: మండలంలోని మద్దుట్లలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన చేపట్టారు. కొండగట్టు గిరి ప్రదర్శనలో భాగంగా మద్దుట్లలో మ్యాకల మహేశ్ తమ పొలం వద్ద హనుమాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సురేశ్ ఆత్మారాం మహరాజ్, ఏలేటి గంగారెడ్డి, సర్పంచ్ కెల్లెటి మల్లమ్మ, రమేశ్, చంద్రయ్య, ముస్కెల శంకర్ పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

రాయికల్: మండలంలోని కొత్తపేటలో ఎన్‌ఆర్‌ఐ మస్కట్ సభ్యుల ఆధ్వర్యంలో వినాయకుని విగ్రహానికి అర్చకులు రాజేశ్వర్‌శర్మ ఆధ్వర్యంలో నవగ్రహ పూజ, కలశపూజ, వినాయక పూజ, హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్‌ఆర్‌ఐ మస్కట్ సభ్యులను భక్తులు అభినందించారు.



పడిపూజలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

ఘనంగా అయ్యప్ప పడిపూజ

మెట్‌పల్లి: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఆధ్వర్యంలో పడిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వామి శ్రీశ్రీశ్రీ చక్రవర్తుల పురుషోత్తమాచార్యులు గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్పస్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు చేశారు. పెద్ద సంఖ్యలో హాజరైన స్వాముల భజనలు, కీర్తనలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలోని కాలేజ్ గ్రౌండ్ శ్రీ దుర్గా ఆలయ ఆధ్వర్యంలో మంగళవారం అష్టాదశ కలశ మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అయ్యప్ప భక్తుల భజనలు, కీర్తనలతో కాలేజ్ గ్రౌండ్ అంతా మారుమోగింది. కార్యక్రమంలో కౌన్సిలర్ పెండెం గణేశ్, అర్చకుడు పాలెపు రామకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ప్రజా పాలన గ్రామసభలు

ధర్మపురి: ప్రభుత్వ పరిపాలనను ప్రజల వద్దకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా ఈనెల 28 నుంచి జనవరి 6 వరకు గ్రామపంచాయతీల్లో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. మండలంలోని 25 గ్రామాల్లో అధికారులు దరఖాస్తులను స్వీకరించనున్నారు. ధర్మపురి మున్సిపాలిటీలో ఉన్న 15 వార్డుల్లో రోజుకో రెండు వార్డుల్లో దరఖాస్తులు స్వీకరిస్తారు.

పెగడపల్లి: ఆరు గ్యారంటీల అమలులో భాగంగా అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు నేటి నుంచి మండలంలో ప్రజాపాలన గ్రామ సభలను నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎంఏ ఫరూక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

రాయికల్: రాయికల్ పట్టణంతో పాటు, మండలంలోని 32 గ్రామాల్లో జనవరి 6వ తేదీ వరకు ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్, ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్ తెలిపారు.

19 గ్రామాలు.. 148 కౌంటర్లు

కథలాపూర్: మండలంలో నిర్వహించే ప్రజా పాలన సభలను మూడు అధికార బృందాలతో నిర్వహిస్తామని ఎంపీడీవో జనార్దన్ మంగళవారం తెలిపారు. తహసీల్దార్ ముంతాజిబొద్దిన్, ఎంపీడీవో జనార్దన్, డెప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌లు బృందాలకు బాధ్యులుగా ఉంటారన్నారు.

కోరుట్ల రూరల్: మండలంలో నేటి నుంచి జనవరి 6 వ తేదీ వరకు ప్రజా పాలన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎంపీవో నీరజ మంగళవారం తెలిపారు. మండలంలోని అన్నిగ్రామాల్లో ఆరుగ్యారంటీల దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.

మల్యాల: మండలంలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీవో వేంకటేశం తెలిపారు. ప్రతి 100 ఇళ్లకు ఒక ప్రత్యేక కౌంటర్ చొప్పున 225 ఏర్పాటు చేశామని తెలిపారు.

నియామకం

బీజేపీ కోరుట్ల పట్టణ అధ్యక్షుడిగా వెంకటేశం



వెంకటేశం

కోరుట్ల: భారతీయ జనతా పార్టీ కోరుట్ల పట్టణ అధ్యక్షుడిగా బింగి వెంకటేశంను నియమిస్తూ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పైడిపెల్లి సత్యనారాయణ రావు మంగళవారం నియామక పత్రం అందజేశారు. తన నియామకానికి సహకరించిన నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్, స్థానిక నాయకులకు బింగి వెంకటేశం కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా గోపిడి శ్రీనివాస్‌రెడ్డి



శ్రీనివాస్‌రెడ్డి

మల్లాపూర్:బీజేపీ మల్లాపూర్ మండల అధ్యక్షుడిగా గోపిడి శ్రీనివాస్‌రెడ్డిని నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు పైడిపెల్లి సత్యనారాయణరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శ్రీనివాస్‌రెడ్డికి నియామక పత్రాన్ని అందించారు. మండల అధ్యక్షుడిగా నియమించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడిపెల్లి సత్యనారాయణరావు, సహకరించిన ఎంపీ ధర్మపురి అరవింద్, కోరుట్ల నియోజకవర్గ కన్వీనర్ చెట్టపల్లి సుఖేందర్‌గౌడ్‌కు శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మున్నూరు కాపు యూత్ అధ్యక్షుడిగా శ్రీనివాస్



శ్రీనివాస్

సారంగాపూర్: తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు యూత్ వెల్ఫేర్ జగిత్యాల నియోజకవర్గం అధ్యక్షుడిగా బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామానికి చెందిన మ్యాడ శ్రీనివాస్ పటేల్ నియమితులయ్యారు. తన నియమకానికి కృషిచేసిన మున్నూరు కాపు యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆరె ధశరథం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో మున్నూరు కాపు సంఘం బలోపేతానికి కృషిచేస్తానని శ్రీనివాస్ తెలిపారు.

28న ఉచిత నేత్ర వైద్య శిబిరం



కోరుట్లటౌన్: పట్టణంలోని పద్మశాలీ భవనంలో ఈ నెల 28న ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు లయన్స్‌క్లబ్ పట్టణ అధ్యక్షుడు వనపర్తి చంద్రమోహన్ తెలిపారు. లయన్స్ ఐ హాస్పిటల్ రేకుర్తి ఆధ్వర్యంలో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కంటి చూపులో లోపాలు ఉన్నవారు వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. పరీక్షలో మోతెబిందు ఉన్నవారిని గుర్తించి, ఉచిత ఆపరేషన్లు చేయిస్తామని పేర్కొన్నారు. ఆపరేషన్ చేయించుకునేవారు తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్సు తీసుకుని రావాలని పేర్కొన్నారు. పట్టణ, పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేకులపల్లి ఎత్తిపోతల నుంచి నీటి విడుదల



ఎత్తిపోతల పథకం ప్రారంభిస్తున్న ఎంపీపీ

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం రేకులపల్లి ఎత్తిపోతల పథకం ద్వారా మంగళవారం అధికారులు పంట పొలాలకు సాగునీటిని విడుదల చేశారు. రెండేళ్ల క్రితం గోదావరి ఉప్పొంగి, రోళ్లవాగు ప్రాజెక్టు తెగిపోవడంతో ఎత్తిపోతల పథకం పూర్తిగా కొట్టుకుపోగా, గత ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. పనులు నిర్వహించడంలో జాప్యం కావడంతో నాలుగు రోజుల క్రితం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి రేకులపల్లి, కమ్మునూర్ ఎత్తిపోతల పథకాలను వెంటనే ప్రారంభించాలని సూచించడంతో నీటి పారుదల శాఖ ఇంజినీరింగ్ అధికారులు, ట్రాన్స్‌కో అధికారులు శ్రమించి ఎట్టకేలకు నీటిని ముందుగా ట్రయల్ రన్ ప్రారంభించి అనంతరం పంట పొలాలకు నీరు చేరడానికి సంపుల్లోకి నీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మసర్తి రమేశ్, విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు, ఎంపీటీసీలు రంగు లక్ష్మణ్, నాయకులు చెర్యారి సుభాశ్, జోగిరెడ్డి, లక్ష్మీనారాయణ, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం



సీపీఐ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

కోరుట్ల: పట్టణంలోని భారత కమ్యూనిస్ట్ పార్టీ 99వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ పతాకాన్ని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ ముందు ఉంటుందన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో భారత కమ్యూనిస్టు పార్టీ ముఖ్య పాత్ర పోషించిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మునుగోడు హనుమంతు, గల్ఫ్ జేఏసీ నేత రవి గౌడ్, చుక్క లక్ష్మం రాజన్, ఎస్‌కే. చాంద్ పాషా, రైతులు, కూలీలు, కార్మికులు పాల్గొన్నారు.

మేడిపల్లి: సీపీఐ ఆవిర్భావ వేడుకలను మంగళవారం మండలంలోని కొండాపూర్‌లో ఘనంగా నిర్వహించారు. సీపీఐ మండల అధ్యక్షుడు హన్మంతు, జిల్లా నాయకుడు ఎద్దండి భూమయ్య పాల్గొని మాట్లాడారు. తాడిత, పీడిత ప్రజల అభివృద్ధి కోసం సీపీఐ ఆవిర్భవించిందని తెలిపారు. కార్యక్రమంలో గంగరాజం, లక్ష్మణ్, బొల్లె రాజయ్య, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

మల్లాపూర్: గ్రామాల్లో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోమ్ముల చిన్నారెడ్డి అన్నారు. మండలంలోని రేగుంట గ్రామ అధ్యక్షుడిగా పొన్నం భూమానందం, ప్రధాన కార్యదర్శిగా నిమ్మల రాజును నియమించి మంగళవారం వారికి నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజల పక్షాన పోరాడాలన్నారు. కాంగ్రెస్‌కి అధికారమిచ్చిన ప్రజలకు ఆరు గ్యారంటీలను చేరవేయాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపైనే ఉందన్నారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గజ్జి రమేష్‌పటేల్, కాంగ్రెస్ మండల నాయకులు మామిడి రాజశేఖర్ రెడ్డి, ఇప్పపెల్లి గణేష్, పన్నాల శేఖర్, బొమ్మెన మహేశ్, మోతే మనోహర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

జగిత్యాల: నేటి నుంచి 29 వరకు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ బాస్కెట్‌బాల్ పోటీలకు కేజీఆర్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు సీహెచ్.శరణ్య, అక్షిత ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను డైరెక్టర్ గోవర్దన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సనత్‌కుమార్, శారద అభినందించారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

రాయికల్: పట్టణానికి చెందిన ఇంద్రాల గంగారాం ఇటీవల మృతిచెందగా, ఆయనతో 2002 సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులంతా కలిసి రూ.77 వేలు జమ చేసి ఆయన కూతురు ఇంద్రాల కేశవర్థిని పేరిట డిపాజిట్ చేశారు. డిపాజిట్ పత్రాలను మంగళవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వీరిని గ్రామస్తులు అభినందించారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

మల్లాపూర్: మండలంలోని వేంపల్లిలో మంగళవారం అనారోగ్యంతో చొప్పరి భూమక్క(70) అనే వృద్ధురాలు మృతి చెందగా, అంత్యక్రియల కోసం బాధిత కుటుంబానికి జీపీ నుంచి రూ.10 వేల ఆర్థిక సాయాన్ని ఇన్‌చార్జి ఉపసర్పంచ్ తిరుపతి, వార్డుసభ్యురాలు దివ్య, నాయకులు అందించారు.

అంతర్జాతీయ కరాటే బ్రౌన్ బెల్ట్ పరీక్షలో విద్యార్థి అర్హత

ఇబ్రహీంపట్నం: హైదరాబాద్‌లో సోమవారం జపాన్ కరాటే అసోసియేషన్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జపాన్ బ్రౌన్ బెల్ట్ డిప్లమో పరీక్షలో ఇబ్రహీంపట్నంకు చెందిన ఆర్. హర్షవర్ధన్ ఉత్తీర్ణత సాధించినట్లు కరాటే మాస్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. విద్యార్థికి రాష్ట్ర కరాటే శిక్షకుడు మాస్టర్ రాపోలు సుదర్శన్ ప్రతిభ పురస్కారాలు, ప్రశంసా పత్రాలు, బెల్ట్‌లు అందచేసినట్లు పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం మోతె సబ్‌స్టేషన్ పరిధిలోని మోతె, వెల్దుర్తి, గొల్లపల్లె గ్రామాల్లో బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ఆపరేషన్ చల్‌గల్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కొండగట్టులో కొడంగల్ విద్యార్థులు



స్వామివారిని దర్శించుకుంటున్న విద్యార్థులు

కొండగట్టు: కొండగట్టు అంజన్నను సీఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గ పరిధిలోని రాయ్‌చూర్ గ్రామానికి చెందిన ఓ ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు దర్శించుకున్నారు. అధికారులు వారికి ప్రత్యేక దర్శనం కల్పించారు.

బాలుడి అప్పగింత

కొండగట్టు: కొండగట్టు అంజన్న ఆలయానికి మంగళవారం దర్శనానికి వచ్చిన నిజామాబాద్ జిల్లా అమృతపురానికి చెందిన ఏడేళ్ల బాలుడు తప్పిపోయాడు. వెంటనే పోలీసులను సంప్రదించగా వారు మైక్‌లో వివరాలు తెలిపి బాలుడిని వారి తల్లిదండ్రులు పల్లవి సతీశ్‌కు ఏఎస్సై శ్రీనివాస్ అప్పగించారు.